
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 13 ఆగస్టు 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





కొనసాగుతున్న ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక కస్తూరి దేవి గార్డెన్‌లో సి ఫుడ్ ఫెస్టివల్ కొనసాగుతోది. రెండో రోజు శనివారం వివిధ రకాల సముద్రపు చేపలు, రొయ్యలు, పీతలను నిర్వాహ కులు ప్రద ర్శనకు ఉంచారు. మత్స్యశాఖ ఉన్నతాధి కారులతో పాటు ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు స్టాల్స్‌ను పరి శీలించారు. ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు మీడియాతో మాట్లాడుతూ మత్స్య శాఖ ఆధ్వర్యంలో భూమి ఆర్గానిక్ సౌజ న్యంతో ఈ ప్రదర్శన విజయ వంతంగా సాగు తుందన్నారు. ఆది వారంతో ఈ ప్రదర్శన ముగుస్తుందన్నారు.



ఉదయగిరి వైసిపిలో ఆధిపత్య పోరు

ఉదయగిరి వైసిపిలో ఆదిపత్యపోరు రోజు రోజుకు ఎక్కువవుతోంది.. మేకపాటి కుటుంబంలో వచ్చిన రాజకీయ విభేదాలు ఆపార్టీలో మరింత వివాదానికి కారణమైంది. ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వైసిపిని వీడి టిడిపి గూటికి చేరిన విషయం తెలిసిందే.చంద్రశేఖర్‌రెడ్డితో సఖ్యతగా ఉన్న వైసిపి నేతలు మేకపాటి కుటుంబంతో ప్రస్తుతం విభేధిస్తున్నారు. ఉదయగిరి టికెట్ ఆశిస్తున్న నేతలు ఓవైపు, మేకపాటి కుటుంబానికి వ్యతిరేకంగా మరో వైపు కలిసి సుడిగుండంగా మారింది. ఆపార్టీ జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సఖ్యత కుదర్చడానికి చేసిన చర్యలు ఫలితం ఇవ్వలేదు. ఇదే క్రమంలో ఇటు వైసిపి, అటు టిడిపి నేతల ఆర్థిక మూలాలపై మేకపాటి కుటుంబం కన్నేసి, ఇరుకున పెడుతుందనే ప్రచారం సాగుతోంది. ఈ పరిణాలు ఉదయగిరి వైసిపి కలవరపెడుతుండగా, అధిష్టానం గమనిస్తుంది..

- మేకపాటికి వ్యతిరేకతంగా కూటమి
- స్వపార్టీ, ప్రతిపక్షపార్టీ నేతల ఆర్థిక మూలాలపై గురి
- 'వేమిరెడ్డి'కి తలనొప్పులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాజకీయాలు ఎప్పుడు ఏలా మారుతాయో ఎవరికీ తెలీదు. నిన్న, మొన్నటి వరకు మేకపాటి కుటుంబానికి బలమైన కేంద్రంగా ఉన్న ఉదయగిరి నియోజకవర్గంలో ఆపార్టీ ఆదిపత్య పోరు కొనసాగుతోంది. వైసిపిలో మూడు గ్రూపులుగా మారినట్లు కనిపిస్తోంది. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఉదయగిరిలో తనకంటూ ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ నేతలతో కలిసి కొన్ని వ్యాపారాలు, రాజకీయాలు చేసినట్లు తెలిసింది. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఒక్కసారిగా ఉదయగిరి వైసిపి పరిస్థితి అయోమయంగా మారింది. చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడే చేజర్ల సుబ్బారెడ్డితో పాటు మరికొందరు నేతలు తిరుగుబావుటా ఎగురవేశారు. ఆయన అవినీతి, అక్రమాలంటూ అధిష్టానికి ఫిర్యాదు చేశారు. మేకపాటి కుటుంబంలో విబేధాలు పార్టీని అతలాకుతలం చేసింది. చంద్రశేఖర్‌రెడ్డి వ్యవహారశైలిపై సోదరుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇదే సమయంలో చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతు ఇచ్చే నేతలను దూరంగా పెట్టినట్లు సమాచారం. చంద్రశేఖర్‌రెడ్డి టిడిపిలో చేరడంతో ఉయగిరి వైసిపి టికెట్ కోసం నేతలు బారులు తీరారు. చేజర్ల సుబ్బారెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి క్యూ కట్టారు. ఇదే సమయంలో దుత్తలూరు నేత చేజర్ల చలమారెడ్డి తన కుమారుడు దుత్తలూరు ఎంపిపి చేజర్ల జయంత్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పావులు కదిపినట్లు తెలుస్తోంది. మేకపాటి రాజమోహన్‌రెడ్డి తన కుటుంబ



ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో భేటీ అయిన ఉదయగిరి వైసిపి నేతలు (ఫైల్)

ప్రాధాన్యత తగ్గకూడదని సోదరుడు మేకపాటి రాజారెడ్డిని రంగంలోకి దింపారు. వైసిపి టికెట్ ఆశించిన నేతలంతా మేకపాటి కుటుంబానికి వ్యతిరేకంగా తయారయ్యారు. కుటుంబం, పార్టీలో చీలిక, రావడంతో ఇప్పుడు మేకపాటి పరిస్థితి ఇబ్బంది కరంగా మారింది..

'మేకపాటి'కి వ్యతిరేక కూటమి..!

ఉదయగిరి నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా ఉన్న మేకపాటి కుటుంబానికి ఇప్పుడు అనేక సమస్యలు చుట్టుముట్టాయి. మేకపాటి రాజారెడ్డికి టికెట్ ఇవ్వవద్దని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. చేజర్ల సుబ్బారెడ్డి, చేజర్ల చలమారెడ్డి, గురవారెడ్డి, అల్లూరు రాజు, ఓబుల్‌రెడ్డిలు బహిరంగంగా వ్యతిరేకిస్తున్నా, అనేక మంది తెరవెనుక రాజకీయం నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ అంశం ముఖ్యమంత్రి దృష్టి వెళ్లడంతో కూర్చోబెట్టి రాజకీయ చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి అప్పగించినట్లు తెలిసింది. ఇదే సమయంలో నెల్లూరు లోకసభ నుంచి వేమిరెడ్డి పోటీచేయనుండడంతో సర్దుబాటు చేయడానికి ప్రయత్నాలు చేశారు. జులై 30న నెల్లూరు మాగుంట లేవుట్‌లో ఆయన నివాసంలో మేకపాటి విక్రమ్‌రెడ్డి, మేకపాటి రాజారెడ్డితో అసమ్మతి నేతలను కూర్చోబెట్టే ప్రయత్నం చేశారు. రాజారెడ్డి అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. విషయం మళ్లీ మొదటికొచ్చింది. ఎవరూ తగ్గేదే లేదు అనడంతో ఉదయగిరి వైసిపిలో అసమ్మతి సెగలు బలంగా వీస్తున్నాయి. ఇది ఇలాగే సాగితే ఆపార్టీకి ఇబ్బందులు తప్పవని తెలుస్తోంది.

స్వపక్ష, ప్రతి పక్ష నేతల ఆర్థిక మూలాలపై గురి..!

2024 ఎన్నికల నేపథ్యంలో ఉదయగిరి వైసిపి నేతలు స్వపక్ష, ప్రతిపక్ష నేతల ఆర్థిక మూలాలపై గురిపెట్టినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో మర్రిపాడు, దుత్తలూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో టిడిపి నేతలు భూ అంశాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. అధికారులు ఆచీతూచి అడుగులేస్తున్నారు. దుత్తలూరు వైసిపి నేత చేజర్ల చలమారెడ్డి, ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మరో నేత 2020 నుంచి దుత్తలూరు మండలంలో వ్యాపారాలు చేస్తున్నారు. నాడు ఒప్పుగా కనిపించిన వ్యాపారాలు, ఇప్పుడు తప్పంటూ అధికారులు నిలుపుదల చేశారు. ఇది అధికారపార్టీ నేతలు కావాలనే చేశారనే ప్రచారం సాగుతోంది. ఇదే అంశం ముఖ్యమంత్రి కార్యాలయం చేరినట్లు తెలిసింది. ఎన్నికల సమయానికి స్వపక్ష, ప్రతిపక్ష నేతల ఆర్థికమూలాలను టార్గెట్ చేశారని కొందరు వైసిపినేతలు ఆపార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

'చిన్నారి'పై 'చిరుత' పంజా

పొతిరెడ్డిపాళెం శోకసంద్రం - రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి-కోవూరు

తిరుమల వెంటేశ్వరస్వామి దర్శనం కోసం కాలినడక వెళుతోన్న ఆరేళ్ల చిన్నారి లక్షిత (6) పై చిరుత దాడి చేసింది. శుక్రవారం జరిగిన ఈ సంఘటన హృదయవిదాకంగా ఉంది. కోవూరు మండలం, పోతిరెడ్డి గ్రామానికి చెందిన లక్షిత తల్లిదండ్రులు శశికళ, దినేష్‌కుమార్ కలిసి తిరుమల దారిమార్గంలో నడుచుకుంటూ వెళ్లారు. మార్గమధ్యలో అదృశ్యమైన బాలిక శనివారం శవమై కనిపించింది. ఈ సంఘటన తిరుమల భద్రతకు మరోసారి సవాల్ విసిరింది.ఈ ఘటనతో తిరుపతి రుయా ఆస్పత్రిలో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. టీటీడీ, ఫారెస్ట్ అధికారుల తీరును లక్షిత తల్లి తప్పుబట్టింది. వన్య మగాలు వరుసగా దాడులు చేస్తుంటే.. మెట్ల మార్గాన్ని ఎందుకు మూసివేయడం లేదని ప్రశ్నించారు. భక్తుల ప్రాణాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారని లక్షిత తల్లి కన్నీరుమున్నీరైంది. తమ బిడ్డ మతికి అధికారుల తీరే కారణమని మండిపడ్డారు. లక్షిత కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియోను టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రకటించారు. తిరుమలలో మరింత కట్టుదిట్టమైన భద్రత కల్పిం చనున్నట్లు టిటిడి ఈఓ ఎవి ధర్మారెడ్డి వెల్లడించారు. ఈ ఘటనతోనైనా టిటిడి యుద్ధప్రాతిపదికన భద్రతా చర్యలు చేపట్టి, భక్తుల్లో నెలకొన్న అభద్రతా భావాన్ని పోగొట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టాలని కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు.

ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం4 గంటలకు లక్షిత తల్లిదండ్రులు శశికళ, దినేష్‌కుమార్‌లతో కలిసి అలిపిరి మార్గంలో తిరుమల కొండకు కాలినడకన శ్రీవారి దర్శనానికి బయల్దేరారు. రాత్రి 7.30 గంటలకు లక్ష్మీనరసింహస్వామి గుడి వద్దకు చేరుకున్నారు. ఇంకో గంట సమయం ప్రయాణిస్తే తిరుమలకు చేరుకుంటాననగా.. ముందు వెళ్తున్న చిన్నారి కనిపించకుండా పోయింది. దీంతో పోలీసులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలు చేసేందుకు వీలు పడలేదు. శనివారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి కొద్దిదూరంలో బాలిక మృతదేహాన్ని గుర్తించారు. తొలుత ఎలుగుబంటి దాడిలో బాలిక మృతిచెందినట్లు టిటిడి డిఎఫ్ఒ అనుమానం వ్యక్తం చేశారు. చిరుత దాడిలోనే చిన్నారి మృతిచెందినట్లు పోస్టుమార్టం రిపోర్టులో రుయా ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. అనంతరం బాలిక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోతిరెడ్డిపాళెంకు మృతదేహాన్ని తీసుకొ చ్చారు. గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగి పోయింది. అనంతరం అంత్యక్రియులు నిర్వహించారు.



లక్షిత(ఫైల్)

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో : టిటిడి ఛైర్మన్

లక్షిత కుటుంబానికి టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. మృతురాలి కుటుంబానికి ఆయన సానుభూతి తెలిపారు. టిటిడి ఐదు లక్షలు, అటవీ శాఖ ఐదు లక్షలు కలిపి మొత్తం 10 లక్షలు లక్షిత కుటుంబానికి అందిస్తామని చెప్పారు. బాలిక మృతదేహం లభించిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం కరుణాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని వెల్లడించారు. భద్రతాపరమైన ప్రతిపాదనలపై చర్చించి టిటిడి ఖర్చుతో రక్షణ చర్యలు చేపడతామన్నారు. చిన్న పిల్లలతో నడకమార్గంలో తిరుమలకు వచ్చే తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నడకదారుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు టిటిడి చేపడుతుందని ఈఓ ఎవి ధర్మారెడ్డి వెల్లడించారు. టిటిడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా మృతిచెందిన లక్షిత కుటుంబానికి 50 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజులు డిమాండ్ చేశారు.

గద్దర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : యుద్ధనౌక గద్దర్ మరణం ప్రగతిశీల ప్రజాస్వామ్య ఉద్యమాలకు ఎంతో ఆవేదనను మిగిల్చిందని పలువురు పేర్కొన్నారు. గద్దర్ సంస్మరణ సభను ఈనెల 27వతేదీన కందుకూరు పట్టణంలో జరపాలని శనివారం కందుకూరు సి.పి.ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావే శంలో ప్రజాకవులు, కళాకారులు, ప్రజా వాగ్గేయకారులు పాల్గొన్నారు. గద్దర్ జీవితం లో పీడిత ప్రజల కొరకు రాసిన రాత, ఆడిన ఆట, పాడిన పాటను మననం చేసు కుంటూ ఈ సంస్మరణ సభను జరపాలని నిర్ణయిం చారు పాలేటికోటేశ్వరరావు, గేరాచిరంజీవి,కళ్ళగుంట మోహనరావు, బి.వెంకటేశ్వర్లు (బివి) యస్ఎ గౌస్, బూసి సురేష్, రావినూతల ముత్తు, గాండ్లహరిప్రసాద్, బి.వి.రమణ, పల్నాటి చెన్నయ్య, సూర్యనారాయణ,సుబానీ, టీచర్ సూర్యం పొనుగోటిప్రభాకర్, దాసరి మల్లిఖార్జున, శరత్ ,డి.మల్లీ న్యాయవాదులు డి.మాధవరావ, ఎస్.పవన్ కుమార్, ముప్పవరపు కిషోర్ ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

యుజిసి జర్నల్‌లో 'ప్రకాశం' ప్రొఫెసర్ పత్రం ప్రచురణ

ప్రజాశక్తి-కందుకూరు : ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌కె దస్తగిరి బాషా యు.జి.సి కేర్ గ్రూప్-1 జర్నల్ లో చోటు దక్కించుకొని అరుదైన గౌరవాన్ని పొందారు. ఫార్మా షూటికల్ కంపెనీలపై ఆయా ఉద్యోగుల నుంచి అభిప్రాయ సేకరణ చేసి విశ్లేషణ పత్రాన్ని సమర్పించారు. ఈ మేరకు శనివారం ఆయన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూ.జీ.సీ) ఆయనకు సర్టిఫికెట్ ఆఫ్ పబ్లికేషన్ ప్రదానం చేసింది. ఎంబిఎ విభాగధిపతిగా డాక్టర్ దస్తగిరి రూపొందించిన పత్రం యుజిసి జనరల్ లో ప్రచురిత కావడం తమకెంతో హర్షదాయకమని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. పలు ఫార్మా షూటికల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆన్ లైన్ ద్వారా ఒక ప్రశ్న పత్రాన్ని పంపించి అభిప్రాయ సేకరణ చేసినట్లు డాక్టర్ దస్తగిరి వివరించారు. టెక్నాలజీ ఆధునికత యాజమాన్య విధా నాలు తదితర అంశాలపై అభిప్రాయ సేకరణ జరిపి విశ్లేషణ పత్రాన్ని రూపొందించానని ఆయన వెల్లడించారు.కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే. విజయ శ్రీనివాస్ జర్నల్స్ లో విశ్లేషణ పత్రాల ప్రచురితం సాధించిన వారికి ప్రత్యేక గుర్తిం పును ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రవికుమార్, ఎం.బీ.ఏ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కెఎల్ పావని దస్తగిరిని అభినందించారు.



డాక్టర్ ఎస్‌కెబాషా

వృద్ధాశ్రమాలకు బియ్యం వితరణ

ప్రజాశక్తి-నెల్లూరు : సిహెచ్ ఎలమందరావు మూడోవర్ధంతిని పురస్కరించుకుని రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పి.హెచ్.పి అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పలు వృద్ధాశ్రమాలకు బియ్యం బస్తాలను వితరణగా అందజేశారు. పొదలకూరు రోడ్డులోని హరిత వద్దుల ఆశ్రమానికి రెండు, బుజబుజ నెల్లూరు ప్రాంతం, నక్కల కాలనీలోని ఆస్థాన వయోవృద్ధుల ఆశ్రమానికి ఒకటి, ఆర్థిక పరిస్థితులతో ఇబ్బంది పడు తున్న ఓ నిరుపేద కుటుం బానికి ఒకటి అందజేశారు. నాలుగు బియ్యం బస్తాలను కీ.శే. సిహెచ్.ఎలమంద రావు సతీమణి యశోద, కుటుంబ సభ్యులు విత రణగా అందజేశారు. పాల్గొన్న జిల్లా పి.హెచ్.పి కన్వీనర్ శాఖవరపు వేణు గోపాల్ మాట్లాడారు. రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పీ.హెచ్.పీ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు గోరంట్ల శేషయ్య , ఆశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరి, నారాయణ పాల్గొన్నారు.

ఆదరించినవారిని గుర్తు పెట్టుకుంటా..

ప్రజాశక్తి-నెల్లూరు

తాను కష్టాల్లో ఉన్నవేళ అండగా నిలబడిన ప్రతి ఒక్కరినీ,తనను ఆశీర్వదించేందుకు ఇంత పెద్దఎత్తున విచ్చేసిన కందమూరు , ఉప్పుటూరు గ్రామాల ప్రజలను ఎళ్లవేళలా గుర్తు పెటుకుంటానని రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం రూరల్ నియోజకవర్గ పరిధిలోని కందమూరు, ఉప్పుటూరు గ్రామాలలో మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ,టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్ళపాక.అనురాధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిమాట్లాడారు. చెరుకూరు చిన్నపెంచలనాయుడు, చెరుకూరు పెద పెంచల నాయుడు, పెంచలరెడ్డి,సింహాద్రి నాయుడు, చేవూరు మధు,గాలి ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు నాయుడు, మహేష్, సునీల్,చైతన్య, ఆర్.పెంచలయ్య,రామయ్య, పెంచలయ్య,రాపూరు పెంచలయ్య,రాపూరు పెంచల్ బాబు,అచ్చి రామయ్య, రాపూరు వెంకటకష్ణయ్య, బెల్లంకొండ మురళి,రాపూరు అంకయ్య,గిరి. వెంకట రమణయ్య,తానికొండ వెంకటేశ్వర్లు, తానికొండ వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

7వ రోజు కొనసాగిన సిపిఎం ప్రజాపోరు యాత్ర

ప్రజాశక్తి-నెల్లూరు

కార్పొరేషన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తన నిర్లక్ష్య ధోరణి విడనాడి పరిష్కారం చూపించాలని, పలు డివిజన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. శనివారం నగర నియోజకవర్గ పరిధిలో 7వ రోజు సిపిఎం ప్రజా పోరుయాత్రను సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావులు ప్రారంభించారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పోరుయాత్ర 7వ రోజు 16వ డివిజన్ పరిధిలోని గుర్రాల మడుగు సంఘం, ఆదిత్య నగర్, బాలాజీ నగర్, రాంజీ నగర్, చిల్డ్రన్స్ పార్క్ ఏరియాలలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్ రావు మాట్లాడుతూ నగర నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలైన మంచినీటి సరఫరా,పారిశుధ్యం, డ్రైనేజీ, వీధిలైట్లు,రోడ్ల సమస్య పరిష్కారాని నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. గుర్రాల మడుగు సంఘంలో ఉన్నటువంటి పంట కాలువ డ్రైనేజీ కాలువగా మారి దుర్గంధభరితంగా తయారైందన్నారు. ఈ ప్రాంతంలో దోమలు స్వైర విహారం చేస్తుండటంతో స్థానిక ప్రజలు అనారోగ్యాలకు గురౌతున్నారన్నారు. ప్రజలు వినియోగించిన విద్యుత్తుకు ప్రభుత్వం వసూలు చేస్తున్న చార్జీల కంటే ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు వంటి పేర్లతో ఈ ప్రభుత్వం అదనపు భారాలు అధికంగా మోపుతుందన్నారు. కరెంటు బిల్లులకు లింకు పెట్టి పింఛన్లు, రేషన్ కార్డులు మొదలగు సంక్షేమ పథకాలలో ప్రభుత్వం భారీగా కోత విధించడం దుర్మార్గమన్నారు. ప్రజా సమస్యలు పరిష్క రించడంలో ప్రభుత్వం తమ నిర్లక్ష్య వైఖరి విడ నాడాలన్నారు. లేని పక్షంలో కార్పొరేషన్, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తా మన్నారు. సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు,,కార్యదర్శివర్గ సభ్యులు జీ నాగేశ్వరరావు,షేక్ మస్తాన్ బి,పి సూర్య నారాయణ, నగర కమిటీ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, కత్తి పద్మ,పి. వేణు శాఖా కార్యదర్శులు సంపూర్ణమ్మ, టి నారాయణ, స్థానిక నాయకులు నారాయణ, లక్ష్మి,మస్తానమ్మ, కుమార్,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొట్టేపాళెంలో : నెల్లూరు రూరల్ మండలం పొట్టే పాలెం గ్రామంలో ప్రారంభమైన ప్రజా సమస్యలపై సిపిఎం పోరుయాత్ర పాద యాత్రను జెండా ఊపి ప్రారంభించిన సిపిఎం సీనియర్ నాయకులు పొట్టేపాలెం చంద్రమౌళి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలివెంగయ్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, నెల్లూరు రూరల్ కమిటీ కార్యదర్శి బత్తల కష్ణయ్య, నెల్లూరు రూరల్ మండలం కార్యదర్శి ఆలూరు తిరుపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు, ముత్యాల నాగయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. వెంకటరమణ, పొట్టేపాళెం శాఖ కార్యదర్శి రమణయ్య, పాల్గొన్నారు.





పొట్టేపాళెంలో...

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-నెల్లూరు


సుప్రీంకోర్టు 1992లో ఇచ్చిన తీర్పును అనుసరించి అంగన్‌వాడీలకు కనీస వేతనంగా రూ.26 వేలు అందజేయాలని, అదే సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సైతం వారికి వర్తింప చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం వేదాయపాళెం, మన్సూర్ భవన్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మాస్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్మికుల శ్రమతో సృష్టించిన సంపదను ప్రభుత్వం 149 మంది కుబేరుల చేతుల్లో పెడుతుందన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అదాని, అంబాని, టాటా, బిర్లా వంటి కార్పోరేట్ సంస్థలకు సహాయసహకారాలు అంద జేస్తున్నాయే తప్ప కార్మికుల శ్రేయస్సు గురించి ఆలోచన చేయడం లేదన్నారు. అంగన్‌వాడీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వి.కుమారి, టి.సంపూర్ణమ్మ, రూరల్ శ్రామిక మహిళా ఎస్‌కె షాహినాబేగం, సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెరకుమార్, ఆఫీస్ బ్యారర్స్ సంపత్‌కుమార్, ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు బత్తల కృష్ణయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్‌కుమార్

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ముత్తుకూరు : రాష్ట్రంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ నిర్వహిస్తున్నటువంటి చలో విజయవాడ విద్యుత్ సౌదా ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లా డారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య, సిఐటియు ముత్తు కూరు మండల కార్యదర్శి గోడ భాస్కర్, ఏపీ జెన్కో నాయకులు కల్లూరి నాగరాజు, పట్టపు మనోజ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ

ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు : ఉపాధ్యాయ, విద్యారంగంలో అప రిష్కృతంగా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 12 గంటల నిరసన కార్యక్రమం చేపట్టారు. 13 డిమాండ్లతో రూపొందించిన ఆరు దశల ఉద్యమ కార్యాచరణలో 4వ దశ పోరాటంలో భాగంగా ఉపాధ్యాయ సంఘాలు ఈ నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. శనివారం కలెక్టరేట్ ఎదుట ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించిన సామూహిక నిరసన కార్యక్రమం ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎ.సురేంద్రరెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు పరిష్కరించడంలో ఫెయిల్ అయిందన్నారు. నానాటికీ ఉపాధ్యాయుల సమస్యలు పేరుకు పోతున్నాయ న్నారు. పర్యవేక్షణ పేరుతో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఉపాధ్యాయులను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. విద్యారంగంలో ఇది మంచి పరిణామం కాదని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ చిట్టేటి రమేష్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తానని ప్రస్తుత సిఎం హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర పరిశీలకులు ఎస్ చిరంజీవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బదిలీ,పదోన్నతులు పొందిన ఉపాద్యాయులకు రెండు నెలలు నుంచి జీతాలు రాకపోవడం చాలా భాధాకరమన్నారు. త్వరగా కేడర్ స్ట్రెంత్ ను అప్డేట్ చేసి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పరిశీలకులు యన్.వి.రమణయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ప్రభుత్వానికి ఏది చెబితే అది చేస్తుందని, పదోన్నతులు బదిలీలు ఒక క్రమ పద్ధతిలో చేయకపోవడం శోచనీయమన్నారు. జిల్లా ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ లు వి. వి. శేషలు, ఎ.ఏడుకొండలు, సి.హెచ్.హాజరత్,ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు,ఆర్.మురళీధర్ ,సనత్ , దశయ్య , పిచ్చి బాబు ,పల్లం వేణుగోపాల్, నవకోటేశ్వర రావు, 400 మంది పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక సంతపేటలోని ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో 88వ వ్యవస్థాపకదినోత్సవ వేడుకలు నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ వేడుకలకు ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌షరీఫ్ అధ్యక్షత వహించారు. జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఎఐఎస్ఎఫ్ మాజీ జిల్లా నాయకులు దయాశంకర్ మాట్లాడుతూ సమరశీల విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో నిమగ్నమైన అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ 88వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విద్యార్థి మిత్రులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.మస్తాన్ షరీఫ్, ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు నాగేంద్ర, ఆదినారాయణ కేక్ కట్ చేసి విద్యార్థులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు శివం వర్మ, జిల్లా సమితి సభ్యులు అక్షయ్,స్వరూప్,లీలాష్,ఆకాష్ నాయకులు వెంకటేష్, మౌళి, సాయి,జీవన్, కిరణ్,అజయ్ ఉన్నారు.

108 జిఓపై చర్చ

నెల్లూరు : స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలల్లో 'సెల్ఫ్ ఫైనాన్స్' పేరుతో సీట్లను అమ్మకం అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వి. రమణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 108 జిఒ రాష్ట్రంలో అమలు చేస్తే ఎదురైయ్యే ఇబ్బందులు.. నిరుపేదలకు వైద్య విద్యనభ్యసించాలంటే ఎదురైయ్యే ఆర్థిక ఇబ్బందులు తదితర అంశాలను ప్రజలకు వివరించి చైతన్య పరచనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రజలు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

పోలీసు వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం

నెల్లూరు : న్యాయశాఖ, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ విభాగాలను సన్వయం చేసుకొని పోలీసులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి ప్రజల్లో పోలీసు శాఖపట్ల విశ్వాసం కలిగేలా వ్యవహరించాలని ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం పోలీసు పేరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్ చంద్రాకాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు అధికారులతో నెలవారీ నేరసమీక్ష నిర్వహించారు. నేరాలపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. గ్రామాలలో బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై చైతన్యం తీసుకురావాలని, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.



'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని వెంగళరావు నగర్, 23వ వార్డులో ఇన్‌ఛార్జి, పట్టణ సచివాలయాల కన్వీనర్ కనుపర్తి రాజశేఖర్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నిర్వహించారు. బాజా బజంత్రీలు, వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లు, కార్యకర్తల కోలాహలం మధ్య పూలమాలలతో స్థానికులు ఘనస్వాగతం పలికారు. వెంగళరావు నగర్ 100అడుగులరోడ్డులోని మాగుంట విగ్రహం సెంటర్ నుంచి కార్యక్రమం మొదలైంది. పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, అమరావేదగిరి సుబ్బరాయుడు గుప్తా, నెల్లూరు వెంకటేశ్వర రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నగ్ల శ్రీనివాస కిరణ్, కుందుర్తి కామయ్య, ఎ.ఎం.సి. సన్నిబోయిన ప్రసాద్, పూనూరు శివకుమార్ రెడ్డి, వేమిరెడ్డి విజయకుమార్ రెడ్డి, పెనుమల్లి అశోక్, గుర్రం వేంకటేశ్వర్లు (జబి), అలా శ్రీనుతోపాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఎం.ఎల్.ఎ. వెంట నడువగా ఇంటింటికి కరపత్రాలు అందించారు. సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికి చేసిన మేలును వివరిస్తూ ముందుకు సాగారు. ఎంఎల్ఎ రామిరెడ్డికి మహిళలు ఎదురేగి హారతులిచ్చి ఆశీర్వదిస్తూ, రామిరెడ్డి మళ్లీ 3వ సారి గెలిచి, మంత్రి పదవి చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న మేలు కన్నా మిన్నగా రానున్న రోజుల్లో జగనన్న పాలన అద్భుతంగా ఉంటుందన్నారు. జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కనుపర్తి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎను ఘనంగా సత్కరించారు.

దోపిడీదారుల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- సుగర్ ఫ్యాక్టరీని మళ్లీ ప్రారంభించాలి
- ఇసుక, మట్టి, గ్రావెల్, దోచుకుంటున్న వైసిపి
- పోరుయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం

దోపిడీదారుల్లా ప్రజలను దోచుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఖండించారు. శనివారం బుచ్చిరెడ్డిపాళెంలో కోవూరు నియోజకవర్గ సిపిఎం ప్రజా పోరు పాదయాత్రలను ఆయన ప్రారంభించారు. పార్టీ కార్యాలయం నుండి బస్టాండు, ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్ మీదుగా గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు రకరకాలుగా భారాలను ప్రజలపై రుద్ది వారిని ఆర్థికంగా దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడాల్సిన ప్రభుత్వాలు పేదలను దోచి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన అధికార దాహంతో ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య, మతాల మధ్య చిచ్చులు పెట్టి చోద్యం చూస్తున్నారా అని ప్రశ్నించారు. మూడు నెలలుగా మణిపూర్లో మారణ హోమం జరుగుతుంటే అటువైపు కన్నెత్తి చూడకుండా శాంతి భద్రతలను తమ పార్టీకి అప్పగించి ఒక వర్గం ప్రజలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కోవూరు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం అని ఇక్కడ వ్యవసాయానికి సరైన ఆదరణ లేదన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత నిరుద్యోగంతో ఉన్నారన్నారు. ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే వైసిపి నాయకులు మాత్రం ఇసుక, మట్టి, ఇంకా గ్రావెల్ మాఫియాల కొమ్ముకాస్తూ సహజవనరులను దోచుకు తింటున్నారన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జగన్మోహన్ రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి అనేక హామీలను గుప్పించారు. హామీల అమలు కోసం స్థానిక శాసన సభ్యులు నాయకులు ప్రయత్నం చేయట్లేదన్నారు. సహకార రంగంలో ఉన్న కోవూరు సుగర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించి ఇక్కడ రైతులకు అండగా నిలుస్తానని ఇచ్చిన హామీ నేటికి నెరవేర్చలేదన్నారు. ముదివర్తి - ముదివర్తిపాళెం మధ్యలో కాజ్‌వే వెంటనే నిర్మించాలని, రాచర్లపాడు ఇఫ్కో భూములను నష్ట పరిహారం రైతులకు వెంటనే చెల్లించాలని, పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని రహదారులను అధ్వానంగా ఉన్నాయి. సత్వరమే వాటికి మరమ్మతులు చేయించడం లేదా.. నూతన రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పారుదల కాలువలు పూడుకు పోయి సాగునీరు అందక రైతుల ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వాడిని ఆధునికరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమ రాజు, కెవిపిఎస్ నాయకులు గోనె దయాకర్, కౌలు రైతు సంఘం కార్యదర్శి తుళ్లూరు గోపాల్, నియోజకవర్గ పాదయాత్రల కన్వీనర్ గన్నవరం శేషయ్య, సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, పార్టీ నాయకులు తంబి రమణయ్య, రఘు రామయ్య, షేక్ జానీ బాషా, విస్సా మునుస్వామి, మద్దిశెట్టి సురేష్, అంకయ్య, పుత్తేడి మల్లికార్జున, గరికిపాటి సురేష్, గండవరపు మల్లికార్జున, వంజివాక కృష్ణ ప్రసాద్, పోతంశెట్టి శ్రీనివాసులు, చల్ల కొలుసు మల్లికార్జున, ప్రజానాట్యమండలి కళాకారులు సిహెచ్ రత్తయ్య కన్నయ్య, కోరిక విజయమ్మ, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్



జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుగు భారతీయ సేవా సమితి సభ్యులు అనంతసాగరం, సంగం, ఎఎస్‌పేట లైబ్రేరియన్స్ శనివారం ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇన్‌ఛార్జి లైబ్రరీ శ్రీనివాస రాజు మాట్లాడుతూ ఎస్.ఆర్.రంగనాథన్ 1892లో ఆగస్టు 12వ తేదీన తంజావూరులోని సియాలిలో జన్మించారని గ్రంథాల శాస్త్రంలో కోలన్ క్లాసిఫికేషన్ గ్రంథాలయ పంచసూత్రాలను కీర్తి గడించారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో విశిష్ట సేవలందించిన విశ్రాంతి ఎ.గోవింద్ రెడ్డి సెలవ పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమానికి లైబ్రెన్స్ కె.రవీంద్రనాథ్ రెడ్డి, డి.నారాయణరావు, తెలుగు భారతీయ సేవాసమితి గౌరవ సభ్యులు ఎస్‌వి రమణయ్య, కొల్లా వెంకటేశ్వర్లు, రాఘవేంద్రరావు, ఎలిశెట్టి నారాయణరావు, ఓ.మల్లికార్జున్, వెంకట్ రెడ్డి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పిల్లలకు నూతన వస్త్రాలు వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం వెంగళరావు నగర్ నివాసులు గుండా పంతులు.సతీష్ - సావిత్రి దంపతుల కుమారుడు బాలసాయి శ్రేయాస్, 4వ పుట్టినరోజు సందర్భంగా వెంగళరావు నగర్‌లో శనివారం సంయుక్త సేవాసంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు నూతన వస్త్రాలు వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎమ్.అజిత్, బాబు, ఎమ్.వి.ఎన్.ప్రసాద్ రావు, దాతలు గుండాపంతుల.సతీష్ - సావిత్రి దంపతులు సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, దాత కుటుంబ సభ్యులు ప్రభాకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు ఎమ్ అజిత్ బాబు, ఎమ్‌విఎన్ ప్రసాద్ రావు మాట్లాడుతూ నేటి దాతలు గుండాపంతుల.సతీష్ - సావిత్రి వారి కుమారుడు బాల సాయి శ్రేయాస్ పుట్టినరోజును పేదల మధ్య జరుపుకోవడం విశేషమని తెలిపారు. ఈ సందర్భంగా పుట్టినరోజు జరుపుకుంటున్న బాలసాయి శ్రేయాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. దాతలకు అభినందనలు తెలిపారు.



షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం

బుచ్చిరెడ్డిపాలెంలో 6వ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి షూటింగ్‌లో పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా నగర పంచాయతీ మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ హాజరయ్యారు. బుచ్చిరెడ్డిపాలెంలో రాష్ట్రస్థాయి పోటీలు, జాతీయస్థాయి పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందన్నారు. అసోసియేషన్ ఏర్పడిన తర్వాత జిల్లాలో ఇది మూడోసారి పోటీలు జరపడం అని తెలియజేశారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి పోటీలు నిర్వహించేలా కృషి చేయాలని అసోసియేషన్ వారికి తెలిపారు. క్రీడలతో మెరుగైన ఆరోగ్యం ఏర్పడుతుందని క్రీడాకారులు అందరు కూడా క్రీడల్లో రాణించి తమ ప్రాంతానికి గుర్తింపు వచ్చేలా కృషి చేయాలని తెలిపారు. మరో అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాముడు మాట్లాడుతూ నెల్లూరులో షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించడం ఎంతో హర్షించదగ్గ విషయమని రాష్ట్ర అసోసియేషన్‌కు నెల్లూరు జిల్లా అసోసియేషన్ వారు ఎప్పుడు ప్రోత్సాహంగా ఉంటారని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వంలో గుర్తించిన షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రవీంద్ర తోమంకు అనుబంధంగా ఆంధ్రప్రదేశ్లో తాము పని చేస్తున్నట్లు తెలిపారు. అధ్యక్షుడు వెంకటరమణయ్య మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బుచ్చిరెడ్డిపాలెంలో మరిన్ని కేటగిరీలో పోటీలు నిర్వహించడానికి తమ సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. 14 జిల్లాల నుంచి బాలజట్లు పాల్గొన్నట్లు 11 జిల్లాల నుంచి బాలిక చెట్లు పాల్గొన్నట్లు నిర్వాహక అధ్యక్షుడు మోర్ల భరత్‌కుమార్ తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి షఉటింగ్ బాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కోశాధికారి విజయ్‌కుమార్, మురళి, మేనకూరి సీతారాంరెడ్డి, కోడూరు మధుసూదన్ రెడ్డి, సతీష్ రెడ్డి, పోటీల నిర్వహకుడు మూర్ల భరత్ కుమార్, యానాద్ రెడ్డి, సత్యం, విల్సన్, ట్రావలిక, మురళి, జయంతి, షకీలా, అనంతమ్మ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి పర్వతరెడ్డి ఎన్నిక



ప్రజాశక్తి-నెల్లూరు

124 ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఏర్పడిన ఎపి గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కు రాష్ట్ర అధ్యక్షులుగా కాకర్ల వెంకటరామిరెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఇందులో 26 సంఘాలు ప్రభుత్వ గుర్తింపు పొంది ఉన్నాయి. ఇందులో 84 సంఘాలు ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులతో కూడిన సంఘాలుగా ఉన్నాయి. కాంట్రాక్ట్, పార్ట్ టైం ఉద్యోగులతో కూడిన సంఘాలు 26 ఉండగా.. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో కూడా 14 సంఘాలు ఉన్నాయి. వీటన్నింటికీ కాకర్ల వెంకటరామిరెడ్డి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డికి పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.



హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన సాయిప్రసాద్

ప్రజాశక్తి-కావలి

గుంటూరులో శనివారం జరిగిన 12వ "ఐలు" మహాసభలో హైకోర్టు న్యాయమూర్తి భట్టు దేవానంద్‌ను కావలి లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది ఇస్కల సాయిప్రసాద్ మర్యాదపూర్వంగా కలిశారు. బట్టుదేవానంద్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయ మూర్తిగా పనిచేసి, అనేక తీర్పులు వెలువరించారు. సదరు న్యాయమూర్తికి అభినందనలు తెలిపారు. ఇటీవల కాలంలో సదరు న్యాయమూర్తి మద్రాస్ హైకోర్టుకి బదిలీ అయ్యారు.

బస్సులపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమమే..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

అనుమతులు లేని ప్రయివేటు బస్సులపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే తీవ్రంగా ఉద్యమిస్తామని జిల్లా ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు మారుబోయిన రాజా హెచ్చరించారు. శనివారం ఇందుకూరుపేట మండల ఆటో యూనియన్ సభ్యులతో కలిసి అనుమతి లేని బస్సుల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు మారిబోయిన రాజా మాట్లాడుతూ ఇందుకూరుపేట నుండి నెల్లూరు తిరుగుతున్న టౌన్ బస్సులు నారాయణరెడ్డిపేట వరకు పర్మిట్ ఉంటే ఇందుకూరుపేటకు కూడా అనుమతులు లేకుండా తిప్పుతున్నారని, గత రెండు రోజుల నుంచి పలుమార్లు ఇందుకూరుపేట ఎస్ఐ, తహశీల్దారు, ఆర్‌టిఒ వంటి సంబంధిత అధికారులకు అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. కానీ అధికారులు బస్సు యజమానితో కుమ్మక్కై నిబంధనలను అతిక్రమించి బస్సులు ఇందుకూరుపేట వరకు వచ్చి ఆటోకార్మికుల పొట్ట కొడుతున్నారన్నారు. అనుమతి లేని బస్సులపై వెంటనే ఆర్‌టిఒ చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలన్నారు. సంబంధిత బస్సులకు ఎక్కడి వరకు పర్మిట్ ఉందో అక్కడ వరకే బస్సులు తిప్పుకోవాలని తెలియజేశారు. అనంతరం సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మురళి మాట్లాడుతూ ఆటో నడుపుకొని జీవనాధారం సాగించే ఆటో కార్మికుల కడుపు కొట్టి బస్సు యజమానులు అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బస్సులు నడుపుతున్నారన్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని అనుమతులు లేని బస్సులను నిలిపివేయాలని పేర్కొన్నారు. లేకపోతే భవిష్యత్తులో తీవ్ర ఉద్యమానికి దారి తీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దయా సాగర్, వాసు, సిపిఎం మండల నాయకులు మైపాటి కోటేశ్వరరావు, కోనేటివెంకయ్య, ఆటోస్టాండ్ సభ్యులున్నారు.



మాట్లాడుతున్న మారుబోయిన రాజా


ప్రత్యేక పూజలు చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని చాబ్రోలు గ్రామం సిద్ధులకోనలోని శివాలయంలో శనివారం ఉదయగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, వైసిపి యువ నాయకులు కృష్ణప్రసాద్ రెడ్డి, పెగళ్లపాడు సర్పంచ్ శ్రీనివాసులు యాదవ్, జనార్ధన్, శ్రీధర్ రెడ్డి, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సిరిపురంలో 'నా మట్టి - నా దేశం'

ప్రజాశక్తి-కావలిరూరల్

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆజాదీ కా అమృత్ కార్యక్రమంలో భాగంగా శనివారం సిరిపురం గ్రామంలో నా భూమి -నా దేశం కార్యక్రమాన్ని ఉప సర్పంచ్ ఉప్పల జ్వాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ ఎ.వి.మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లను, పౌరులను గౌరవించుకోవడం భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలను తెలియబరచడం బానిస సమానత్వం జాడలను వేరు చేయడం పౌరుల విధులను తెలియజేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. అనంతరం దేశం కోసం జీవితాలను త్యాగం చేసిన వీరులను, నేలతల్లికి, నమస్కరిస్తూ మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలను నాటారు. గ్రామస్తులు జాతీయ జెండాలు చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం సెక్రెటరీ గొట్టిపాటి లావణ్య, ఆలూరి శంకరరావు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వెలుగు విఒఎ పరుసు మంజుల, గ్రామస్తులు పాల్గొన్నారు.





బాలకృష్ణ అభిమాని మధుకు పరామర్శ

ప్రజాశక్తి-బిట్రగుంట

విశ్వనాథరావుపేట పంచాయతీకి చెందిన నందమూరి తారక రామారావు, బాలకృష్ణ వీరాభిమాని, కావలి డివిజన్ అధ్యక్షుడు భీమవరపు.మధు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కాంద్ర యువనేస్తం వ్యవస్థాపకులు కాంద్ర సతీష్ నాయుడు శనివారం మధు ఇంటికి వెళ్లి పరామర్శించి పండ్లు అందజేశారు. కప్పరాళ్ల తిప్పకు చెందిన ఆవుల.వరకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలుకు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న అతన్ని పరామర్శించారు. సతీష్ నాయుడు మాట్లాడుతూ భీమవరపు మధు తెలుగుదేశం పార్టీలో రామారావు పార్టీని స్థాపించినప్పటి నుండి ఆయన వీర అభిమానిగా బాలకృష్ణ అభిమానిగా పార్టీకి ఎనలేని సేవలు చేశారని తెలిపారు. ఆయనకు కాంద్ర యువ నేస్తం అండగా ఉంటుందని ఆయన భరోసానిచ్చారు. యువనేస్తం సభ్యులు పీట్ల.ప్రత్యూష్ కుమార్, శ్రీనివాసులు నాయుడు, జైభీం అంబేద్కర్ సేవాదళ్ వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్ర, తదితరులున్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : నియోజకవర్గ డివిజన్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి భవనాలు శిథిలమవుతున్నాయి. వాటికి ప్రత్యామ్నాయంగా 2012లో ఆర్‌డిఒ, తహశీల్దార్, ట్రెజరీ మూడు భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టినా ట్రెజరీ కార్యాలయం మాత్రమే పూర్తయింది కానీ, మిగతా రెండు భవనాలు నేటికీ పూర్తి కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. తహశీల్దార్ కార్యాలయం, ఆర్‌డిఒ కార్యాలయాలు బ్రిటీష్ కాలం నాటివి ఆ రెండు కార్యాలయాలు పరిపాలన అక్కడి నుండే కొనసాగిస్తున్నారు. అవి శిథిలావస్థకు చేరుకోవడం వల్ల గతంలో ఆత్మకూరు శాసనసభ్యులుగా ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా చొరవ చూపారు. అప్పట్లో నెల్లూరు, కావలి, డివిజన్ పరిధిలో వివిధ మండలాలకు వేరు చేస్తూ ఆత్మకూరు పది మండలాలు కలిపి ఆత్మకూరు కేంద్రంగా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కొలువుదిరింది. దాంతో ఆత్మకూరు ఆర్‌డిఒ కార్యాలయం పాత మండల పరిషత్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. వీటికి నూతన భవంతులు కలిపి మొత్తం మూడింటిని సమదాయ భవనానికి అంకురార్పణ చేశారు. ఆత్మకూరు తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఈ మూడు భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే నిర్మాణంలో నింపాదిగా జరుగుతుండడంతో ఈ నిర్మాణాలు ఎప్పటికీ పూర్తవుతాయో అనే సంగతి అర్థం కాని రీతిలో తయారైంది. ట్రెజరీ కార్యాలయం మాత్రం పూర్తయింది. పాత కార్యాలయం నుండి నూతన భవనంలోకి చేరారు. అయితే మిగిలిన ఆర్‌డిఒ, తహశీల్దార్, కార్యాలయాల్లో వర్షాలు వచ్చినప్పుడు తహశీల్దార్ కార్యాలయం పైకప్పు ఒక పెంకు లేచిపోవడంతో వర్షాలు పడితే నీళ్లు కారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రికార్డులు తడిచిపోతాయని తాత్కాలికంగా తర్పాలిన్ పట్టలు కప్పి జాగ్రత్త పడుతున్నారు. కార్యాలయంలోని ఉద్యోగులు నిర్వహణాంత గందరగోళంలో ఎక్కడ దస్త్రాలు తడుస్తాయనే ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అలాగే ఆర్‌డిఒ కార్యాలయం గతంలో పాతకాలంనాటి మండల సభ మందిరంలో ఆర్‌డిఒ ఛాంబర్ కొనసాగిస్తున్నారు. అదేవిధంగా పాత మండల కార్యాలయంలోనే ప్రస్తుతం ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది తలదాచుకుంటున్నారు. నూతన భవనం ఎప్పుడు పూర్తి అవుతుందా సొంతగూటికి చేరేది ఎప్పుడా అని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం సిబ్బంది నిరీక్షిస్తున్నారు. ఈ రెండు భవనాలకు మరుగుదొడ్లు కూడా లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ రెండు భవనాలు ఎప్పుడు పూర్తి అవుతాయా అని ఎదురుచూస్తున్నారు. ఇవన్నీ గమనించి సమస్యను పాలకవర్గం అధికారులు పరిష్కరించాలని పలువురు కోరుకుంటున్నారు.


అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్‌డిఒ, తహశీల్దారు కార్యాలయాలు

సమస్యల పరిష్కారం కోసం ప్రజాపోరు యాత్ర

ప్రజాశక్తి-నెల్లూరు

నగర, రూరల్ నియోజకవర్గ పరిధిలోని 54 డివిజన్లలో ప్రజా సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ప్రజాపోరు యాత్రకు పిలుపునిచ్చింది. ఈ పోరు యాత్ర రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్లలో 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించగా నగర నియోజకవర్గ పరిధిలో 28 డివిజన్లలో 15వ తేదీ వరకు ప్రజాపోరు యాత్రను నిర్వహిస్తున్నారు. సిపిఎం నిర్వహిస్తున్న ప్రజాపోరు యాత్రలో రూరల్, నగరం నియోజకవర్గాలలోని అనేక డివిజన్లలో స్థానిక, మౌలిక సమస్యలున్నట్లు స్థానిక ప్రజలు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిశీలించి పరిష్కరించాలని ఆయా డివిజన్ల పరిధిలోని సచివాలయాల ఎదుట 15వ తేదీ వరకు ధర్నా కార్యక్రమం చేపట్టి వినతిపత్రం అందజేసే ప్రయత్నం చేయనున్నారు. ముఖ్యంగా అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, వివిధ కారణాలతో తొలగించిన పింఛన్లు, సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలని, విద్యుత్తు సంస్కరణల పేరుతో పెంచిన విద్యుత్తు ఛార్జీలు తక్షణమే రద్దు చేయాలని ప్రజల తరుపున సిపిఎం డిమాండ్ చేస్తుంది. కెవిఆర్ పెట్రోల్ బంకు ప్రాంతం నుంచి అయ్యప్పగుడి సెంటర్ వరకు జాతీయ రహదారికి మరమ్మతులు చేయాలని, నగర, రూరల్ నియోజకవర్గాల పరిధిలో గతంలో అభివృద్ధి పనుల పేరుతో రహదారులను ధ్వంసం చేశారని, వాటికి మరమ్మతులు చేయాలని, డ్రెయినేజీ కాలువలను నిర్మించాలని, దోమల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి వారం క్రమం తప్పకుండా ఫాగింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. 18వ తేదీలోగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాని పక్షంలో కలెక్టరేట్‌ను ముట్టిడి చేస్తామని ప్రభుత్వానికి సిపిఎం హెచ్చరించింది.

వీక్షణం

ఉపాధ్యాయ, విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘం ఫ్యాఫ్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 12 గంటల నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 13 డిమాండ్‌లతో రూపొందించిన ఆరు దశల ఉద్యమ కార్యాచరణలో 4వ దశ పోరాటంలో భాగంగా ఉపాధ్యాయ సంఘాలు ఈ నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో భూమి ఆర్గానిక్ సౌజన్యంతో మూడు రోజుల పాటు సీఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సీఫుడ్ ఫెస్టివల్‌కు విశేష స్పందన కనిపించింది. ఈ ఫెస్టివల్‌లో వివిధ రకాల సముద్రపు చేపలు, రొయ్యలు, పీతలను నిర్వాహకులు ప్రదర్శనకు ఉంచారు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పేరుతో నగరంలో నిర్వహించిన పాదయాత్రలతో ఆ పార్టీ కార్యకర్తల్లో శ్రేణుల్లో ఉత్సాహం నెలకొన్నది. టిడిపి శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపేందుకు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు జిల్లాలో పర్యటించడంతో నగర, రూరల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు నిరాశ, నిస్పృహలో ఉన్న కార్యకర్తల్లో ఉత్సాహం వెల్లుబుగుతుంది. దాదాపుగా రూరల్, నగర అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఖరారు కావడంతో ఎన్నికల ప్రచారం చాపకిందనీరులా సాగిపోతుంది. మహాశక్తి చైతన్య రథయాత్ర పేరుతో మహిళలతో కలిసి టిడిపి నాయకులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో మట్టి మాఫియా ఆగడాలు శృతి మించిపోతున్నాయి. అక్రమంగా రాత్రి వేళ్లలో భారీ వాహనాల్లో మట్టిని తరలించే సమయంలో ప్రజలు తమ ప్రాణాలను కోల్పోతున్నారు. వీటిపై ప్రతి పక్ష పార్టీలు, అధికార పార్టీలు ఒకరిపై మరోకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మాత్రం సమయం కేటాయించలేని పరిస్థితికి చేరుకున్నారు.